# పల్లకి

–వీటూరి భాస్కరమ్మ

"అమ్మాయ్! ఏం చదువుకున్నావమ్మా?'' అడిగింది జానకమ్మ.

సోఫాలో పొందికగా కూర్చుని గోళ్ళకేసి చూసుకుంటున్న వినత ఉలిక్కిపడి తలెత్తి ఆవిడకేసి చూసింది. జవాబు చెప్పాలంటే నోరు పెగలటం లేదామెకు. పెళ్ళి కొడుకు సూటిగా తనకేసే చూస్తుంటాడనే ఆలోచన ఆమెను మూగదాన్ని చేసింది.

''అన్నయ్యా! కాబోయే వదిన గారికి మాటలు రావేమో...'' అంటూ కిలకిలా నవ్వింది నీరజ.

తిలక్ నవ్వాడు. ''ఏమోమరి. ఈసారి నువ్వు ట్రై చెయ్యి'' అంటూ చెల్లెలి భుజం తట్టి ప్రోత్సహించాడు.

వాళ్ళిద్దరినీ ఓరకంట గమనిస్తూనే వుంది వినత. ఆమెకు ఉవ్వెత్తున రోషం పొంగి వచ్చింది. చివాలున తలెత్తింది.

''నా పేరు వినత. బికామ్ చేసి టైపు పరీక్షలు రాశాను. అప్పుడప్పుడు పత్రికలకు కథలూ, కవితలూ వ్రాస్తుంటాను. ఉద్యోగం చేద్దామంటే ముందు పెళ్ళిచేసుకో అన్నారు డాడీ'' అంది ఏకబిగిన, తరువాత నాలుక్కరుచుకుంది. అందరూ తనను చూసి నవ్వుకుంటున్నారేమో.

తలెత్తేసరికి ఎదురుగా తిలక్ కనిపించాడు ఆమెకేసే చూస్తున్నాడు. అతని పెదాలపై కొంటె నవ్వు మెరుస్తోంది. తల వాల్చేసింది వినత.

''ఇంక లోపలకు వెళ్ళమ్మా'' అన్నారు పరంధామయ్య గారు.

'బ్రతికానురా బాబూ!' అనుకుంటూ లోపలకు వెళ్ళిపోయింది. పెళ్ళి చూపులంటే ఎక్కడి లేని వణుకు వచ్చేస్తుంది తనకు. ఎన్నిసార్లో సిగ్గు పడకుండా, సూటిగా వాళ్ళడిగే ప్రశ్నలకు జవాబు చెప్పాలని అనుకుంటుంది. కాని ఆ సమయంలో మాత్రం అంతా గాలికెగిరి పోతుంది.

కాలేజీ వార్షికోత్సవం సమయంలో డిబేట్లో గడగడా మాట్లాడి ఫస్టు ప్రయిజ్ గెల్చుకున్న తనకు ఈ సమయంలో మాత్రం ఈ తడబాటు ఏమిటో... 'అవి కాలేజీ డిబేట్, ఇవి పెళ్ళి చూపులు' అంది మనస్సు. అవునేమో మరి.

జడ ముందుకేసుకుని ప్రక్కకు తిరిగి అద్దంలో ప్రతిబింబాన్నిచూసుకుంటూ అలాగే నిల్చుండిపోయింది వినత.

పావుగంట తర్వాత వాళ్ళ కారు వెళ్ళిపోయిన శబ్దం వినిపించింది. ఆ వెంటనే గదిలోకొచ్చింది వినత తల్లి సుందరమ్మ.

''వినతా! ఈ సంబంధం కుదిరేటట్లే ఉందమ్మా! అతనికి నువ్వు నచ్చావుట. ఎల్లుండి అన్నీ మాట్లాడుకునేందుకు మీ నాన్న గారిని రమ్మని చెప్పారు వాళ్ళు'' అంది ఆనందంగా.

వినత అప్రతిభురాలై తల్లికేసి చూసింది. ఇంతవరకూ ఎవరూ తనను నచ్చిందని వెంటనే కాదు కదా తరవాతైనా రాయలేదు. అవును మరి... ఎందుకు రాస్తారు? తను అందగత్తేమీ కాదు. పోనీ తండ్రి భారీగా కట్నం ఇస్తారేమో అంటే తను మధ్య తరగతి కుటుంబంలో ఆడపిల్ల. మరి వీళ్ళకెలా నచ్చింది? ఏమో అతనికంటికి తను అందంగా కనిపించిందేమో. అందుకే అంటారు 'తావలచింది రంభ, తామునిగింది గంగ' అని...

''మాట్లాడవేం వినతా! అతను నీకు నచ్చాడా?'' అడిగింది సుందరమ్మ వినత భుజంమీద చేతితో తట్టి.

వినత ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది. తలొంచుకుని మెల్లగా చెప్పింది. ''ముందు నాన్న గారిని మాట్లాడి రానివ్వమ్మా! ఇప్పుడే ఆశలు పెంచుకోవటం ఎందుకూ? అయినా అతనికేం తక్కువనీ నచ్చకపోవటానికి'' అంది సిగ్గుపడుతూ.

ఆప్యాయంగా కూతురు ముఖంలోకి చూసింది సుందరమ్మ. 'భగవంతుడా! ఈ సంబంధం అయినా కుదిరేలా చెయ్యి' అని ప్రార్థించింది మనస్సులోనే.

కట్నం దగ్గర ఎలానూ బెడిసిపోతుంది అనుకుంది వినత నిరాశగా. కాని ఆమె అంచనాలను తారుమారు చేస్తూ అసలు కట్నం వద్దని తిలక్ పట్టుబట్టాడట. పరంధామయ్య గారి ద్వారా విన్నారంతా.

OOO

అనుకున్న ముహూర్తానికే తిలక్ వినత మెడలో మూడు ముళ్ళు వేశాడు. ఊరేగింపుకు కారు ముస్తాబు చేశారు.

''ఎంచక్కా పల్లకీ అయితే బాగుంటుంది వదినా!'' అంది నీరజ ఎగతాళిగా.

విసుగ్గా ముఖం చిట్లించింది వినత. 'ఛ ఛ ఉత్త అడవి మేళం అనుకుంది కసిగా.'

''నీ పెళ్ళికి పల్లకీలోనే ఊరేగిస్తాలే'' అన్నాడు తిలక్ నవ్వుతూ.

నీరజ ముఖం ఎర్రబడింది. మౌనంగా తలొంచుకుంది. ఊరేగింపు సాగుతున్నంతసేపూ నీరజ తిలక్‌కు కుడిప్రక్క కూర్చుని ఏవేవో చెబుతూనే ఉంది. అతను కూడా తన ప్రక్క కొత్త పెళ్ళి కూతురు ఉందనే ధ్యాస కూడా లేకుండా నీరజతో కబుర్లు చెబుతూనే ఉన్నాడు.

మొదటిసారిగా నీరజ పట్ల ద్వేష భావం తలెత్తింది వినతలో.

OOO

బీరువాలోంచి నీరజ బట్టలు కూడా తీసి బ్రీఫ్ కేసులో పెడుతున్నాడు తిలక్. కొత్త దంపతులు కొత్త కాపురం పెట్టడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఆ రోజే ప్రయాణం.

''అవి నీరజ బట్టలు, నావికావు'' అంది వినత.

''తెలుసు'' అన్నాడు తిలక్ ముభావంగా.

''మరి...'' ఆపేసింది వినత వాక్యాన్ని ఎలా పూర్తి చెయ్యాలో తెలియక.

''నీరజ కూడా మనతో వస్తుంది'' చెప్పాడు. చేదు తిన్నట్టుగా ముఖం పెట్టింది వినత. అయితే తిలక్ గమనించలేదు.

''నేను ఆఫీసుకు వెళ్ళిపోయాక ఒక్క దానివీ నీకేం తోస్తుంది! తను కూడా వస్తే ఇద్దరూ ఒకరికొకరు తోడుంటారు.''

''నాకు ఒక్క దానికీ తోచదని మీతో చెప్పిన గుర్తు లేదు'' అంది వినత.

''అయితే ఇంతకూ నువ్వనేదేమిటి? నీరజను రావద్దనేనా?''

''అహ... అది కాదు.''

''మరేం? అయితే ఇంక మాట్లాడకు. నీకూ ఊసుపోతుంది. కొత్త చోట్లో చెల్లాయితో సరదాగా ఉంటుంది'' అన్నాడు తిలక్ సర్దటం పూర్తి చేసి.


వినత మరి మాట్లాడలేదు. వాళ్ళతో నీరజ ప్రయాణం ఖాయమైంది. మర్నాడే తిలక్ ఉద్యోగం చేసే ఊరికి వెళ్ళాడు.

ఉదయం లేచిన దగ్గర నుంచీ తిలక్‌కి ఏం కావాలో అన్నీ నీరజే చూస్తోంది. తిలక్ కూడా తన

కేం కావాల్సినా అన్నీ నీరజకే చెప్తాడు.

ఒంటికి కారం రాసుకున్నట్టుగా ఉంది వినతకు.

'అసలాయనకు బుద్ధి లేకపోతే సరి. అన్నిటికీ




ముద్దుల చెల్లెలే కావాలి. పెళ్ళాం ఉందన్న మాటేగాని ఓ సరసమూ, పాడా. ఆమాత్రం దానికి పెళ్ళెందుకు చేసుకున్నారో' కసిగా తనలోనే సణుక్కుంది. భర్తతో ఏకాంతంగా కబుర్లు చెప్పుకోవాలనీ, అతని వెనకాల స్కూటర్ మీద కూర్చుని అతని నడుముని వాటేసుకుని సినిమాలకూ, షికార్లకూ వెళ్ళాలనీ వినత కన్న కలలలో ఏ ఒక్కటీ నిజం కాలేదు. ఆఫీసుకు మాత్రమే స్కూటర్ వాడతాడు తిలక్. మిగతా చోట్లకు భార్యనూ, చెల్లెలినీ తీసుకుని సిటీ బస్‌లోనే వెళ్తాడు.

తన బాధను ఎవరికీ చెప్పుకోలేక, దిగమ్రింగుకోనూ లేక అవస్థ పడసాగింది వినత. క్రమంగా చిక్కి శల్యమై పోసాగిందామె. ఎక్కడకు వెళ్ళాలన్నా ఆసక్తి చూపదు. భర్తతో గాని, ఆడపడుచుతో గాని మాట్లాడదు. నీరజ కల్పించుకుని మాట్లాడబోతే ఉరిమి చూసేది. దాంతో నీరజ కూడా ముభావంగానే ఉండసాగింది.

OOO

''హలో! బాలగంగాధర తిలక్‌గారూ!'' అన్న కంఠం వినిపించేసరికి ఉలిక్కిపడి అటు చూశాడు తిలక్.

ఎవరో యువకుడు. తెల్లని శరీరచ్ఛాయ, మెడలో బంగారు చెయిన్, వ్రేళ్ళకు ఉంగరాలు. ఖరీదైన సూటు. ఎవరబ్బా!...

అతను దగ్గరగా వచ్చి తిలక్ భుజం చరిచాడు. ''నేనురా, మధుని. మరచిపోయావా?''

అప్పుడు గుర్తుకొచ్చింది తిలక్‌కి. ఏనాటిది తమ స్నేహ బంధం! ప్రాథమిక విద్య దగ్గర నుంచి, ఇంటర్ వరకు కలిసే చదువుకున్నారు. వాడికి ఎమ్‌సెట్‌లో ర్యాంక్ వచ్చి మెడిసిన్ చదవటానికి వెళ్ళిపోయాడు. తను బియ్యే చేసి ఏదో చిన్న ఉద్యోగంలో స్థిరపడిపోయాడు.


''హలో! చాలా రోజులకు కలిశాం, బాగున్నావా? ఏం చేస్తున్నావ్? గవర్నమెంటు జాబా? ప్రైవేటు ప్రాక్టీసా?'' అడిగాడు తిలక్.

''ప్రైవేటు ప్రాక్టీసే. ఈ మధ్యనే ఫారిన్ నుంచొచ్చి క్లినిక్ ఓపెన్ చేశాను. ఇదుగో విజిటింగ్ కార్డు. తప్పక రావాలి. అన్నట్టు పెళ్ళి చేసుకున్నావా?''

కార్డుకేసి చూస్తూ తలూపాడు తిలక్.

''ఏమిటీ? నువ్వు చదివింది మానసిక శాస్త్రమా?''

''అవును. ఇక నేనూ వెడతానురా. అక్కడ మా శ్రీమతి ఎదురు చూస్తుంటుంది.'' త్రుటిలో రోడ్డు క్రాస్ చేసి ఓ ప్రక్కగా పార్కు చేసి ఉన్న కారు దగ్గరకు చేరుకున్నాడు మధు. డాక్టర్ మధు మిత్ర. కారు ప్రక్కగా, బంగారు బొమ్మలా మెరిసిపోతున్న




యువతికేసి చూసి నిట్టూర్చాడు తిలక్. ఎంతైనా మధు అదృష్టవంతుడు! తనూ ఉన్నాడు ఎందుకూ. వినతికి రూపం లేకపోయినా కనీసం మంచి గుణం అయినా ఉంటుందని భ్రమపడ్డాడు తను. వినతలో ఆ గుణం ఉందనే అభిప్రాయంతో కట్నం ఆశించకుండానే తాళికట్టాడు.

అసలీమధ్య వినత అదోలా ఉంటోంది. ఒకసారి మధుకి చూపిస్తే... ఆ ఆలోచన రాగానే రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకున్నాడు.

OOO

''నీ భార్యను నువ్వు సరిగ్గా అర్థం చేసుకోలేదేమో అనిపిస్తోందిరా నాకు'' అన్నాడు మధు వినతను పరీక్ష చెయ్యటం పూర్తి చేశాక.

అయోమయంగా స్నేహితుడి ముఖంలోకి చూశాడు తిలక్.

''ఆమెకు నేనేం లోటు చెయ్యలేదు. తనక్కావాల్సిన చీరలూ, నగలూ, అన్నీ కొన్నాను.''

నవ్వాడు మధుమిత్ర. ''ఆడదానికి కావాల్సినవి చీరలూ, నగలూ మాత్రమే కాదు'' అన్నాడు పేపర్ వెయిట్ తిప్పుతూ.

''మరి...''

''తన అభిరుచులూ, ఆశయాలూ అర్థం చేసుకునే భర్త. ఆమె కథలు అవీ వ్రాస్తుంటారని చెప్పావ్ కదా. ఎప్పుడైనా ప్రోత్సహించావా?''

తలొంచుకున్నాడు తిలక్. తను ఆ విషయం మరిచేపోయాడు. ఎంతసేపూ నీరజతోనే కాలక్షేపం చేసేవాడు. వినతకు కూడా కొన్ని ఇష్టాలూ, కోరికలూ ఉంటాయని అనుకున్నాడా? తనకేం కావాల్సినా చెల్లాయినే కేకేసేవాడు. తనూ, వినతా ఎప్పుడైనా ఏకాంతంగా మాట్లాడుకున్నారా? పడగ్గదిలో, వంటగదిలో తప్ప వినతను గుర్తించేడా అసలు...

''నువ్వు చెప్పింది కర్రెక్టే మధూ! నేను చాలా మూర్ఖంగా ప్రవర్తించాను..'' నొచ్చుకుంటూ అన్నాడు తిలక్.

''ఇప్పుడైనా ఏమీ మించిపోలేదు. వినత మళ్ళీ మామూలు మనిషి అవుతుంది.''

''ఎలా?''

చెప్పాడు మధుమిత్ర. ఇష్టం లేకపోయినా తలూపాడు తిలక్.

OOO

''ఇదిగో నీరూ! ఏమిటి ఈ షర్ట్ బొత్తాము ఇలా కుట్టేవ్? ఛీ ఛీ'' అరిచాడు తిలక్.

సన్నజాజులు మాలకడుతూన్న నీరజ ఉలిక్కిపడి అన్నకేసి చూసింది.

''ఈ గుండీ అసలీ షర్టు కలర్‌కి సూటైందా?'' కోపంగా చెల్లెలికేసి చూశాడు.

అతని చేతిలో నుంచి షర్టు అందుకుని పరిశీలనగా చూసింది నీరజ. 'తను కుట్టిన గుండీ, మిగతా గుండీలకు కాస్త భిన్నంగా డిజైన్‌తో ఉంది అంతే. దగ్గరగా చూస్తే కాని తేడా తెలీదు. ఈ మాత్రం దానికే ఇంతలా కోప్పడాలా?'

మంచం మీద నిరాసక్తంగా నడుంవాల్చి శూన్యంలోకి చూస్తున్న వినత ఒక్కసారిగా లేచి కూర్చుంది. ఆమె కళ్ళు చిత్రంగా మెరుస్తున్నాయి.

''అసలు ప్రతి దానికీ నిన్నే అడగటం నా తప్పేలే. ఇదే మీ వదినైతే ఎంత చక్కగా కుట్టి ఉండేదో. ఛ. పొరబాటు చేశాను.''

నీరజ కళ్ళల్లో గిర్రున కన్నీళ్ళు తిరిగాయి. ఆమె చేతుల్లో నుంచి షర్టు జారి క్రింద పడింది.

''ఛ మొద్దుమొహం నువ్వూ. మట్టిలో పడేశావ్ ఇస్త్రీ షర్టుని. వెళ్ళి శుభ్రంగా ఉతికి పట్రా. వద్దులే ఇటివ్వు. మళ్ళీ చింపినా చింపుతావు. మీ వదినకు చెప్తాలే'' అంటూ షర్టు తీసుకుని తన గదిలోకి వెళ్ళిపోయాడు తిలక్. కన్నీటిని తుడుచుకోవటం కూడా మరచి అలానే నిల్చుండి పోయింది నీరజ. ఆమె హృదయంలో బడభాగ్నులు రగులుతున్నాయి.

కిటికీ వద్ద నుంచి లేచి మంచం మీద కూర్చుంది వినత. ఆమె హృదయం ఆనందంతో ఎగిసి పడుతోంది.

తిలక్ గదిలోకొచ్చి బెడ్‌మీద కూర్చున్నాడు. వినత భుజం మీద చెయ్యి వేసి ప్రేమగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

''చూడు వినీ! గుండీ కుట్టమంటే ఎలా పాడు చేసిందో మహాతల్లి. నువ్వు సరిగ్గా కుట్టగలవా?'' అడిగాడు.

కుట్టగలనన్నట్టు తలూపింది వినత.

''చూడూ ఇకపై నా పనులన్నీ నువ్వే చెయ్యాలి. చేస్తావా?''

ఆనందంగా అతనికేసి చూసింది. ఆమె కళ్ళల్లో కొత్త ఆశలు రెక్కలు విప్పుకుంటున్నాయి.

తిలక్ రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకున్నాడు. ఫర్వాలేదు వినత మళ్ళీ మామూలు మనిషి అవుతోంది అనుకున్నాడు. అయితే అతనికి తెలీదు. ఊహాకందని మరో సంఘటన జరిగే ప్రమాదం కూడా దగ్గర్లోనే ఉందని.

OOO

''నీరజా! వదినా, నేనూ సినిమాకు వెడుతున్నాం. నీకు ఆకలయితే నువ్వు తినెయ్యి మాకోసం వండొద్దు. మేం హోటల్లో తిని వస్తాంలే'' అన్నాడు తిలక్ స్కూటర్ బయటకు తీస్తూ.

నీరజ అప్రతిభురాలై అతనికేసి చూస్తూండిపోయింది.

''వినీ! రెడీనా'' లోపలకు చూస్తూ పిలిచాడు.

''అయిపోయిందండీ. ఒక్క నిమిషం'' అంది వీక్లీ టేబుల్ మీద పడేస్తూ.

ఆఫీసుకెళ్ళేటప్పుడే చెప్పాడేమో అప్పటికే రెడీ అయిపోయింది వినత. బయటకొచ్చి స్కూటర్ మీద కూర్చుని భర్త నడుం చుట్టూ చేతులు బిగించింది.

స్టార్ట్ చేశాడు తిలక్. స్కూటర్ రివ్వున దూసుకుపోయింది.

కన్నీళ్ళతో మసకబారిన కళ్ళతో వాళ్ళు వెళ్ళే వరకు చూసి తర్వాత ఇంట్లోకి నడిచింది నీరజ.

మంచం మీద వాలిపోయిన ఆమెలో ఉప్పొంగిన దుఃఖ ప్రవాహానికి ఆనకట్టే లేదు.

OOO

రోజులు ఉత్సాహంగా, హుషారుగా వినతకు

సాగుతుంటే, నిస్సారంగా, నిస్తేజంగా నీరజకు సాగుతున్నాయి. తిలక్ ప్రవర్తనలో పూర్తిగా మార్పొచ్చేసింది. ప్రతి చిన్న విషయానికీ చెల్లెల్ని కసరటం, భార్యను పొగడటం సాగిస్తున్నాడు.

''అన్నయ్యా! నేను మన ఊరికి వెళ్ళిపోతాను బస్సు ఎక్కించు.''

''ఎందుకూ? మేం ఇక్కడ నిన్ను రాచి రంపాన పెడుతున్నామని అమ్మకూ, నాన్నకూ చెప్పడానికా? అదేం కుదర్దు. చచ్చినట్టు పడి ఉండు.''

''అదికాదు నాకిక్కడ ఏమీ తోచడం లేదు.''

''తోచకపోతే వంట పనిలో మీ వదినకు సాయం చెయ్యి. ఎంతసేపూ ఆ నవలలూ, పత్రికలూ చదువుతూ బుర్ర పాడు చేసుకోకు'' అంటూనే విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయాడు తిలక్.

తనక్కావాల్సిన పుస్తకాలు దగ్గరుండి కొనిచ్చిన అన్నయ్యేనా ఈ మాటలంటున్నది. శిలలా నిల్చుండి పోయింది నీరజ.

ఆమె కళ్ళ ముందే వాళ్ళిద్దరూ ఒకరి చేతులు ఒకరు పట్టుకుని దగ్గర్లోనే ఉన్న పార్కుకు వెళ్ళిపోయారు. నీరజ కళ్ళు తుడుచుకుని వంటింట్లోకి వెళ్ళింది. మధ్యాహ్న భోజనాల తర్వాత వంట పాత్రలైనా కడగలేదు కాబోలు వినత. అవన్నీ చెల్లాచెదురుగా సింక్ నిండా పడి ఉన్నాయి. కొంగు నడుం చుట్టూ బిగించి పనిలో మునిగిపోయింది నీరజ.

రాత్రి ఎనిమిది దాటాక వచ్చారు వినతా, తిలక్‌లు. డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్దింది నీరజ. ఇద్దరూ స్నానం చేసి ఫ్రెష్‌గా వచ్చారు.

''నేను వడ్డిస్తానులే మీ అన్నయ్యకు నువ్వెళ్ళు'' అంది వినత.

నీరజ మౌనంగా అక్కడి నుంచి తప్పుకుంది. భోజనం చేస్తున్నంత సేపూ సణుగుతూనే ఉన్నాడు తిలక్. వంట బాగోలేదనీ, నీరజ అన్నీ పాడు చేసిందనీ, వినతైతే చక్కగా వండేదనీ...

''నీరజా? మా భోజనాలు అయిపోయినాయి. నువ్వు వెళ్ళి తిను'' అంది వినత మొక్కుబడికి.

''నాకాకలి లేదు వదినా! అన్నీ సర్దెయ్యి'' అంది నీరజ.

''అది తినేసే ఉంటుంది వినతా! ఎందుకలా దాన్ని బ్రతిమిలాడుతూ టైమ్ వేస్ట్ చేస్తావు. అప్పుడే తొమ్మిది దాటింది'' అని తిలక్ బెడ్‌రూమ్‌లోనుంచే కేకలేశాడు.

వినత గదిలోకెళ్ళి తలుపు మూసింది. రోజూ రాత్రి భోజనాలు ముగిశాక ఒక గంట సేపైనా క్యారమ్స్ ఆడుతూనో, కబుర్లు చెబుతూనో, చెల్లెలి



తో కాలక్షేపం చేసేవాడు తిలక్. అప్పుడుగాని అతనికి సంతృప్తి ఉండేది కాదు.

ఆ రోజు ఆదివారం.

మధు మిత్ర దగ్గరకు వినతను తీసుకెళ్ళాలని అంతకు ముందు రోజే నిర్ణయించుకున్నాడు తిలక్.

''నీరజా! వదినా, నేనూ డ్వాక్టరు గారింటికి వెడుతున్నాం. ఏ నవలో పట్టుకుని కూర్చోకుండా వంట చేసి ఉంచు'' అన్నాడు చెల్లెలి నుద్దేశించి.

తలూపింది నీరజ. త్రోవ పొడవునా ఆలోచిస్తూనే ఉన్నాడు తిలక్. ఈ నెల రోజుల్లోనే వినతలో వచ్చిన మార్పుని చూసి ఎంత ఆశ్చర్యపోతాడో. అసలామెనా పరిస్థితికి తెచ్చింది తనేకదూ.

''రండి, రండి బావున్నారా?'' సాదరంగా ఆహ్వానించింది సుచిత్ర.

''బాగున్నాం. వాడింటి దగ్గరున్నాడా? చుట్టాలింటికి చెక్కేశాడా?'' అడిగాడు తిలక్. పేషెంట్లకు చుట్టాలని ముద్దు పేరు పెట్టాడతను.

''ఉన్నారు. తర్వాత తాపీగా వెడతారు. కూర్చోండి వస్తారు. స్నానం చేస్తున్నారు'' అంటూ వంటింట్లోకి నడిచింది సుచిత్ర.

ఇద్దరూ సోఫాలో కూర్చున్నారు. డ్రెస్సింగ్ రూమ్‌లోంచి బైటికొచ్చాడు మధుమిత్ర. వస్తూనే వినతను చూసి ఆశ్చర్యపోయాడు. కదలని శిలలాంటి వినతలో ఎంతమార్పు! గలగల పారే సెలయేరులా, తుళ్ళిపడే జలపాతంలా ఎంత హుషారుగా ఉంది!!

''ఈ రోజు ఇక్కడే మీ భోజనం'' అంది సుచిత్ర కాఫీ ట్రేతో వస్తూ.

''ఎందుకండీ. అక్కడ నీరజ వండేస్తుంది'' అన్నాడు తిలక్ మొహమాటంగా.

''వండదని కాదు. మా ఆతిథ్యాన్ని ఎప్పుడు స్వీకరిస్తారు మరి. ఎప్పటికప్పుడే తప్పించుకుంటున్నారు. ఈ రోజు వదలం'' అన్నాడు మధు.

తిలక్‌కి అంగీకరించక తప్పలేదు. భోజనాలై, ఎండతగ్గాక తాపీగా ఇంటికొచ్చారు ఇద్దరూ. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

''నీరజ ఏం చేస్తోందో. పిచ్చిపిల్ల! అన్నం తిందో, లేదో...'' చెల్లెలి మీద మమకారంతో తిలక్ కళ్ళు తడి అయ్యాయి. మెల్లగా ఆమె గదిలోకి నడిచాడు. మంచం మీద అటు తిరిగి పడుకుని వుంది నీరజ.

''నీరజా! నిద్రపోతున్నావా? అన్నం తిన్నావా లేదా?'' అంటూ ఆమెను మెల్లిగా ఇటు తిప్పి తుళ్ళి పడ్డాడు తిలక్.

నీరజ శరీరం కట్టెలా బిగుసుకుపోయి ఉంది.

ప్రాణం కంటే మిన్నగా ప్రేమించిన అన్నయ్య నుండి ఎదురైన తిరస్కారాన్ని తట్టుకోలేని ఆ సున్నిత హృదయిని నిద్రమాత్రలు మ్రింగి రాగ ద్వేషాలూ, సుఖదుఃఖాలూ లేని అనంత లోకాలకు తరలిపోయి అప్పుడే చాలా సమయం దాటింది.

○○○

నీరజ అంతిమ యాత్రకు పాడె సిద్ధం చేశారు.

పూలతో దాన్ని అలంకరిస్తున్న తిలక్ కళ్ళల్లో జలపాతాలు ప్రవహిస్తున్నాయి.

''నీ పెళ్ళికి పూల పల్లకీని అలంకరిస్తున్నాను నీరూ! ఎంత బాగుందో చూశావా?'' అంటూ పిచ్చివాడిలా రోదిస్తున్న తిలక్‌ని ఆపటం ఎవరికీ సాధ్యం కావటం లేదు.

''నన్ను క్షమించు నీరజా! మొదటి నుంచీ నీ పట్ల ద్వేషంతోనే ప్రవర్తించాను. నీ చావుకి కారణం నేనే.. నేనే...'' మౌనంగా విలపిస్తూ నీరజ నిర్జీవ దేహం మీద పూలు చల్లి ముఖాన్ని దోసిట్లో దాచుకుంది వినత.

నీరజ క్షమించిందో, లేదో మరి భగవంతుడికే తెలియాలి.